క్లుప్తంగా

టీచర్స్ సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

కంకిపాడు: ది మండల పరిషత్ టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో జరిగాయి. సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఇంటూరి నాగేశ్వరరావు ఏకగీవ్రంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పి.ఇమ్మానుయేలు, కార్యదర్శిగా కె.కెజియ ఎన్నికయ్యారు. పలువురు డైరెక్టర్లు ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, ప్రతినిధులు కె.మాధవరావు, ఎంవిఎస్ఎన్. ప్రసాద్, యు.టైటస్‌పాల్, ఎ.సత్యవంతు, పి.సురేష్‌బాబు, పి.సాంబశివరావు, రవికాంత్, వేతన కార్యదర్శి పి.రవికుమార్ పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే



విజయవాడరూరల్: వరదల కారణంగా ముంపునకు గురైన పంటల నష్టం అంచనావేసేందుకు సర్వే జరుగుతోందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో మండలంలో పంట పొలాలు నీట మునిగి నష్టం ఏర్పడిందన్నారు. వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో వీఏఎస్‌ల ద్వారా సర్వే జరుగుతోందన్నారు. నున్న, పాతపాడు, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో వరి పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, అంబాపురం, పి.నైనవరం, కొత్తూరు తాడేపల్లి, షాబాదు, జక్కంపూడి, పైడూరుపాడు, రాయనపాడు, గొల్లపూడి గ్రామాల్లో పంటలు పూర్తిగా మునిగాయని, ఫీల్డ్‌లోకి వెళ్లి వీఏఎస్‌లు సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం జరిగిన సర్వేలో వ్యవసాయాధికారి, ఏడీ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే సమాజ అభ్యున్నతి



ఉయ్యూరు: సామాజిక సేవతో సమాజ అభ్యున్నతి సాధ్యమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం తేజ డిజిటల్స్ ప్రాంగణంలో ఆదివారం రాత్రి జరిగింది. లయన్స్ జోనల్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన సభలో నూతన అధ్యక్షుడు నేరెళ్ల తేజ సాయివెంకట్, కార్యదర్శిగా నెల్లి రాంబాబు, ట్రెజరర్‌గా దీనవహి ప్రసాద్‌తో కూడిన కార్యవర్గంతో జిల్లా గవర్నర్ శేషగిరి ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. గద్దె శేషగిరి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా లయన్స్ పనిచేస్తుందన్నారు. లయన్స్ ప్రతినిధులు జీఎస్ శంకర్‌గుప్తా, మిరియాల వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, ప్రసాద్, రామారావు, నూకల వెంకట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేరెళ్లను పలువురు సత్కరించారు.

వరద బాధితులకు చేయూత



గన్నవరం: మండలంలోని బుద్దవరం శివారు దాసులపాక కాలనీలో వరద ముంపునకు గురైన బాధితులకు సోమవారం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ద్వారా నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి సంకాబత్తుల రజితవెంకట్ మాట్లాడుతూ.. నిరాశ్రయులైన కుటుంబాలకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ ఛైర్మన్ సంకాబత్తుల వెంకట్, కమ్మిలి వీర వెంకట సూర్యనారాయణ, స్పందన స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెనమలూరు: వరద బాధితులకు ప్రజాసంఘాలు సోమవారం తమ వంతు సాయం అందించారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సాయంతో సీఐటీయూ, మహిళా సంఘాలు, డీవైఎఫ్ఐ, ప్రజా సంఘాల సహకారంతో పెదపులిపాక, యనమలకుదురులో వరద బాధితులకు ఆహారం పంపిణీ చేశారు.ప్రజా సంఘాలకు చెందిన పిన్నమనేని విజయ, ఉప్పాడ త్రిమూర్తి, షేక్ మస్తాన్‌వలి, షేక్ కాశిం, మాధవ, పాపారావు, పి.పాతాళలక్ష్మి, వల్లిమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: బుడమేరు వరద ముంపు గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు తమ ఉదారతను చాటుకుంటున్నాయి. ఎలుకపాడు గ్రామంలో వరద ప్రవాహానికి నీటమునిగిన కుటుంబాలకు తమ వంతు సాయంగా కాన్సెన్సింగ్ జీసస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్నాక్స్, ఫ్రూట్స్, వాటర్ బాటిల్స్ అందజేశారు. మినిస్ట్రీస్ ఛైర్మన్ పాస్టర్ వాసు ఇంటింటికి వెళ్లి బాధితులకు స్నాక్స్ అందజేశారు. గ్రామ సర్పంచ్ పొలిమెట్ల శ్రీరామ్(నాని), మాజీ సర్పంచ్ మున్నంగి నిరీక్షణరావు, అజ్మీర వెంకటేశ్వరరావు, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కాసరనేనివారిపాలెం వద్ద ఏటిపాయ ఒడ్డును తాకుతూ ప్రవహిస్తున్న వరదనీరు



రామవరప్పాడు ఫ్లైఓవర్ దిగువ ప్రాంతంలో తగ్గని వరదనీరు



ఉంగుటూరులో బుడమేరు వరద ప్రవాహం

వీడని వరద కష్టాలు

- కొనసాగుతున్న వరద ఉధృతి
- ఏటిపాయ అంచులు తాకుతూ ప్రవాహం
- ముంపుతో కుళ్లిపోయిన పంటలు



మద్దూరులో నీటి ముంపు కారణంగా కుళ్లిన వరి చేను

కంకిపాడు: కృష్ణానది ఏటిపాయలో వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీ నుంచి సోమవారం 4.40 లక్షల క్యూసెక్కుల వరదనీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. దీంతో ఏటిపాయ అంచులు తాకుతూ వరదనీరు పరవళ్లు తొక్కుతోంది. కాసరనేనివారిపాలెం వద్ద శివాలయం చుట్టూ వరదనీరు చేరింది. మద్దూరులో ఏటిపాయకు వెళ్లే రహదారి మార్గంలోకి వరదనీరు చొచ్చుకువస్తోంది. ఏటిలో ఉన్న పడవలను మత్స్యకారులు ఒడ్డుకు చేర్చి భద్రపర్చుకుంటున్నారు. వరద ముంపుతో ఎటు చూసినా కుళ్లిపోయి, దెబ్బతిన్న పంట పొలాలే కనిపిస్తున్నాయి. పొలాల్లో ఇంకా మురుగు, ఎగువ నుంచి కొట్టుకువచ్చిన వ్యర్థాలు, గుర్రపు డెక్క దర్శనమిస్తోంది. పంట పొలాలను శుభ్రం చేసుకోవడం కష్టసాధ్యంగా మారిందని, దెబ్బతిన్న పంటలతో అపారనష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. పెట్టుబడులు మొత్తం వరదలో కొట్టుకుపోయినట్టేనని ఆందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి వరద తగ్గడంతో బుడమేరు స్వల్పంగా తగ్గింది. కంకిపాడు-గన్నవరం రహదారిపై ఉప్పలూరు వద్ద నీటి ప్రవాహం తగ్గుతోంది. కాగా ప్రవాహం కొనసాగుతుండటంతో ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో రహదారులు ముంపులోనే ఉన్నాయి. వన్నేరు మాత్రం ఉధృతంగా ప్రవహిస్తూనే ఉంది. తెన్నేరు గ్రామంలో వన్నేరు డ్రెయిను ప్రధాన రహదారి గుండా ప్రవహిస్తోంది. సమీపంలోని నివాసాలను ముంచెత్తింది. సోమవారం కూడా మండలం వ్యాప్తంగా మోస్తరు వర్షం కురవడంతో ముంపు ప్రాంతాల్లో సమస్య మరింత జఠిలంగా మారింది.

గన్నవరం రూరల్: మండలంలోని సావరగూడెం గ్రామం ఇంకా వరద నీటిలోనే ఉంది. కేసరపల్లి నుంచి ఈ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. ఈ మార్గంలో చీమలవాగు, బొబ్బరవాగులు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో ఆ గ్రామస్తులు ముస్తాబాద మీదుగా గన్నవరం రాకపోకలు సాగిస్తున్నారు. జక్కులనెక్కలం గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. గూడవల్లి నుంచి జక్కులనెక్కలం వెళ్లేందుకు ఉన్న రోడ్డు మార్గంలో బుడమేరు వంతెనపై 5 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది.

ఉంగుటూరు: మండలంలో బుడమేరు వరద ఉధృతి తగ్గుతున్నప్పటికీ ఇంకా పలు గ్రామాలు వరద ముంపు నుంచి కోలుకోలేదు. మండలంలో ప్రధాన రహదారులైన తేలప్రోలు-నందమూరు, గన్నవరం-పుట్టగుంట రహదారిలో బుడమేరు వరద ఉధృతి కొనసాగడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బుడమేరు పరివాహక ప్రాంతాలైన 12 గ్రామాల్లో 8వేల ఎకరాల పంట నష్టం జరిగిందని అధికారులు ప్రాథమిక అంచనాలతో సర్వే చేపడుతున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు తహసీల్దార్ విమలకుమారి తెలిపారు.

తగ్గని వరదనీరు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వరద ఉధృతి తగ్గకపోవడంతో లోతట్టు ప్రాంతాలు ముంపులోనే ఉన్నాయి. రామవరప్పాడు ఫ్లైఓవర్ దిగువ ప్రాంతాలు ఇంకా వరదనీటిలోనే మగ్గుతున్నాయి. ఈ ప్రాంతంలోని పలు అపార్టుమెంట్లు, రాఘవేంద్రకాలనీతోపాటు కట్ట ప్రాంతాలైన ఒడ్రు కాలనీ, అబ్దుల్ కలాం కాలనీ, నెహ్రూనగర్, హనుమాన్‌నగర్‌ల్లోని అంతర్గత రహదారులు ముంపులోనే ఉన్నాయి. బుడమేరు, ఏలూరు, రైవస్ కాలువలను ఆనుకుని ఉన్న కాల్వకట్ట ప్రాంతవాసులు మరల వరద ఎక్కడ ముంచెత్తుతుందోనని బిక్కు బిక్కుమంటున్నారు. ఫ్లైఓవర్ దిగువ ప్రాంతాల్లోని చాలా మంది ఇప్పటికే నివాసాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. అలాగే ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని కట్టప్రాంతవాసులు వరద నీరు తగ్గకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అందని నిత్యావసర సరుకులు

రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ముంపునకు గురైన ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులు అందజేయాలని బాధితులు కోరుతున్నారు. వరద ముంచెత్తడంతో జీవనోపాధి, నివాసాలను కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నాయకులు కొంతమేర పాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. నిత్యావసర సరుకులు మాత్రం ప్రభుత్వం నుంచి అందలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద నీటిలోనే గ్రామాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బుడమేర వరద ఉధృతి కొనసాగుతుండటంతో బాపులపాడు మండలంలోని ఆరు గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. 216హెచ్ జాతీయ రహదారిపై ఆరుగొలను-పుట్టగుంట గ్రామాల మధ్య వరద ప్రవాహం ఎడతెరిపి లేకుండా పారుతోంది. దీంతో హనుమాన్‌జంక్షన్-గుడివాడ మధ్య రాకపోకలు నిలిచిపోయారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆరుగొలను, రామన్నగూడెం గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో నిర్వాసితులకు ఉచిత నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. బాపులపాడు మండల పరిధిలోని పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులకు దాతల సాయంతో అధికారులు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులకు పామర్తి గౌతమ్, బెజవాడ విజయ్‌లు రూ. 15 వేలు విలువ చేసే దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు.



బాపులపాడు మండలం ఆరుగొలనులో ఇళ్లలోకి చేరిన వరద నీరు



గుడివాడ-హనుమాన్‌జంక్షన్ రహదారిపై ఆరుగొలను వద్ద ప్రవహిస్తున్న వరద నీరు



లంకపల్లి అగ్రహారం వద్ద నీట మునిగిన పంట పొలాలు



ఓగిరాలలో చెరువును తలపిస్తున్న వరదనీరు



కాసరనేనివారిపాలెంలో కుళ్లిపోతున్న తమలపాకు తోట



తెన్నేరులో వన్నేరు పొంగడంతో నీట మునిగిన రహదారిలో ప్రజల రాకపోకలు

విపత్తుకు కారణం చంద్రబాబే

వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి



కంకిపాడు: విజయవాడ మహా విలయానికి కారకుడు చంద్రబాబే. విజయవాడతోపాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలో మ్యాన్ మేడ్ ఫ్లడ్ నెలకొంది. దీనికి పూర్తి బాధ్యుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వమే. విపత్తు గురించి ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఊళ్లకు ఊళ్లు నీటి ముంపు బారిన పడ్డాయి. పంట పొలాలు ఊడ్చుకుపోయాయి. ఇంతటి ఉపద్రవం మానవ తప్పిదం కాదా?. బుడమేరుకు గేట్లు ఉన్నాయా? అంటూ చంద్రబాబు వెటకారం చేశాడు. బుడమేరు, దాని పరిస్థితి ఏంటో ఆయనకు తెలియదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుడమేరు గేట్లు ఎత్తడం వల్ల నష్టం అధికంగా జరిగిందని చెబితే అడ్డగోలుగా వ్యాఖ్యలు చేసింది కూటమి పెద్దలే. దీని వల్ల పేద, మధ్యతరగతి వర్గాలు నేటికీ వరద ముంపులోనే జీవిస్తున్నాయి. చంద్రబాబు సర్కారు పనితీరు అంతా పబ్లిసిటీ స్టంట్‌గానే సాగుతోంది. 2.60 లక్షల మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వమే లెక్కలు చెప్పింది. పూర్తి స్థాయిలో బాధితులకు సాయం అందక, ఆకలితో సాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. బుడమేరు ఉధృతితో తన సొంత మనుషుల ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు ప్రభుత్వం తీసుకున్న దిక్కుమాలిన నిర్ణయం వల్ల ఈ రోజు విజయవాడ పరిసరాలు పూర్తిగా వరద ముంపులో ఉన్నాయి. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ విపత్తుల నుంచి రైతాంగాన్ని ఆదుకోవడానికి పంటల బీమా చేయించారు. ఈ-క్రాప్ నమోదు సమయానికి పూర్తి చేయించారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం నేటికీ ఈ-క్రాప్ కానీ, పంటల బీమా కానీ ఏదీ సజావుగా పూర్తి కాలేదు. రైతులు పేర్లు నమోదు చేసుకోండి అని ఇప్పుడు చెబుతున్నారు. రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. విపత్తును ఎదుర్కొనేందుకు వైఎస్సార్ సీపీ తమ వంతు బాధ్యతతో వ్యవహరిస్తుంది. అధినేత జగనన్న ఇచ్చిన పిలుపు మేరకు సహాయ కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలంతా ఒక్కతాటిపై నడుస్తున్నాం. బాధితులకు అండగా ఉంటాం.

నున్న హైస్కూల్ పునఃప్రారంభం

నున్న(విజయవాడరూరల్): వారం రోజుల తర్వాత నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ సోమవారం పునఃప్రారంభమైందని ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు నున్న హైస్కూల్‌తోపాటు మండలంలో గొల్లపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, రామవరప్పాడు, నిడమానూరు గ్రామాల్లోని హైస్కూల్స్ పనిచేసినట్టు మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు తెలియజేశారు. మండలంలోని కొన్ని మండల పరిషత్ పాఠశాలలు పనిచేసినట్లు ఆయన తెలిపారు. కాగా భారీ వర్షాలు, వరదల కారణంగా ఆయా పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో గతవారం రోజులుగా సెలవు ప్రకటించారు.

గణపయ్యా.. విఘ్నాలు తొలగించయ్యా..

ఉయ్యూరు: విఘ్నేశ్వరా.. విఘ్నాలు తొలగించయ్యా.. అంటూ భక్తులు గణపయ్యకు విశేష పూజలు చేశారు. వినాయక చవితి ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం వాడవాడలా కొలువుదీరిన గణనాథుడిని భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉయ్యూరులోని కాటూరు రోడ్డులో ఎకో ఫ్రెండ్లీ వినాయకుడికి విద్యార్థులు, చిన్నారులు, ప్రజలు పూజలు చేయించి భక్తిగీతాలు ఆలపించారు. మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ పట్టణంలోని పలుచోట్ల వినాయక ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

కంకిపాడు: మండలంలో గణేష్ నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజైన సోమవారం ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ పాఠశాలలో ప్రతిష్ఠించిన ఎకో ఫ్రెండ్లీ విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ విజయబాబు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు జరిపించారు. ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలతో పర్యావరణహితం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి పర్యవేక్షించారు. ప్రొద్దుటూరు గాయత్రీ విహార్ అసోసియేషన్ బృందం ఏర్పాటు చేసిన వినాయకుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్వామివారి నిమజ్జనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.

నున్న(విజయవాడరూరల్): వినాయక చవితి వేడుకలు మూడవ రోజు సోమవారం గ్రామాల్లో కొనసాగాయి. నున్న గ్రామంలోని హైస్కూల్ సెంటర్ రంగా బొమ్మ వద్ద వినాయకుని విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా లైబ్రరీ సెంటర్, చెరువు సెంటర్లోని పేరంటాళ్లమ్మ గుడి వద్ద వినాయకుని పూజలు జరిగాయి. పాతపాడు గ్రామంలోని గౌడబజారు, యాదవుల బజారు, విలేజి కండ్రికలో శివరామయ్య ఇంటి వద్ద భక్తులు వినాయకుడిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. వెంకటాపురం, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో కూడా చవితి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక హనుమాన్‌నగర్, ఇందిరానగర్, రాజుల కాలనీ, బండివాని చెరువు గట్టుతో పాటుగా గ్రామగ్రామాన గణనాథుని ఉత్సవ మండపాలు ప్రత్యేకంగా ముస్తాబు అయ్యాయి. బాపులపాడు మండలం దంటగుంట్లలో జరుగుతున్న చవితి ఉత్సవాల్లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



ఉయ్యూరులో పూజలందుకుంటున్న ఎకో ఫ్రెండ్లీ వినాయకుడు



దంటగుంట్లలో గణనాథునికి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ



ఈడుపుగల్లు నలందలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు



ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లో విఘ్నేశ్వరుడి ఊరేగింపులో భక్తులు



నున్నలో రంగా బొమ్మ వద్ద గణపతి పూజలు

గుంతలమయంగా జాతీయ రహదారి



దుర్గాపురం వద్ద రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు



గన్నవరం వద్ద దెబ్బతిన్న రహదారి

గన్నవరం: నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి గోతుల మయంగా మారింది. రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని చిన్నఆవుటపల్లి నుంచి రామవరప్పాడు వరకు నాలుగు లైన్ల రహదారిపై గతేడాది ఎన్‌హెచ్ఏఐ మరమ్మతులు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న రహదారిపై కొంతమేర లేయర్ తొలగించి కొత్తగా తారుతో నిర్మాణం చేసింది. అయితే నిర్మాణ పనులు పూర్తయిన రోజుల వ్యవధిలోనే రోడ్డుపై గుంతలు పడుతుండటంతో ఇప్పటి వరకు పూడ్చుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారి పూర్తిగా దెబ్బతింది. రామవరప్పాడు నుంచి చిన్నఆవుటపల్లి వరకు రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. విమానాశ్రయం నుంచి గన్నవరం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో వాహనాలు ఈ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. కేసరపల్లి శివారు దుర్గాపురం వద్ద అయితే రాత్రి వేళలో గుంతల్లో పడి అనేక మంది ద్విచక్ర వాహనదారులు గాయాలపాలయ్యారు. ఇప్పటికైన ఎన్‌హెచ్ఏఐ అధికారులు రోడ్డు పునర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

వరదల్లో బాసటగా...



లారీల్లో గూడ్సును అన్‌లోడ్ చేస్తున్న కార్మికులు

నున్న(విజయవాడరూరల్): వరదల కారణంగా స్తంభించిన రాకపోకలకు గొల్లపూడి వయా నున్న ఆవుటుపల్లి జాతీయ రహదారి ప్రయాణానికి ఎంతో ఉపయోగపడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సత్తుపల్లి వయా నూజివీడు-విజయవాడ రహదారిలో భారీ వరదల వల్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మైలవరం వయా కె.తాడేపల్లి మార్గంలో కూడా ఎలాంటి వాహనాలు విజయవాడ వెళ్లేందుకు వీల్లేకుండా ఉంది. ఇటువంటి పరిస్థితితుల్లో విజయవాడ నుంచి గన్నవరం వచ్చి అక్కడ నుంచి నున్న, ఆగిరిపల్లి, నూజివీడు, విసన్నపేట పరిసర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ జాతీయ రహదారి దోహదం చేసింది. కార్లు, భారీ వాహనాలు సైతం ఈ జాతీయ రహదారిపైనే రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యావసర వస్తువులు కూడా నున్న గ్రామం వరకు వచ్చి అక్కడ అన్‌లోడ్ చేసుకొని చిన్న వాహనాల్లో గమ్యం చేరుస్తున్నారు.